

ఈ చిత్రం చూస్తుంటే సుందర కశ్మీర్ గుర్తుకు వస్తుంది.కానీ ఇది ధారూర్ మండల పరిధి కోట్‌పల్లి ప్రాజెక్టు. దసరా సెలవులు రావడంతో సందర్శకులు బుధవారం అనంత పద్మనాభ స్వామిని దర్శించుకొని, చెంతనే ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చారు. నీటిలో ఇలా సరదాగా బోటింగ్ చేశారు. – న్యూస్‌టుడే, ధారూర్.

బతుకమ్మ సంబురాలకు శ్రీకారం



జిల్లాలోని పల్లెలు, పట్టణాల్లో ఆడపడుచుల ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. పలువురు యువతులు బతుకమ్మను పేర్చి వికారాబాద్ పట్టణ శివారులోని బుగ్గ రామలింగేశ్వర ఆలయ కోనేరు (నీటి గుండం)లో నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే, వికారాబాద్.

దారికి తాత్కాలిక మరమ్మతులు

బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్ మండల కేంద్రంలోని ప్రధాన దారికి సహకార సంఘం ఉపాధ్యక్షులు అజయ్ ప్రసాద్ తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఆర్ అండ్ బీ అంతర్గత దారి గుంతలుపడి అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆయన బుధవారం కంకర మిశ్రమాన్ని వేసి గుంతలను పూడ్చేయించి యంత్రంతో దారి చదును చేయించారు. ఈ దారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

నిధుల వ్యయం.. సేంద్రియ సంపద శూన్యం

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్:

పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో కోట్లాది రూపాయల వ్యయంతో సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాల (కంపోస్ట్ షెడ్లు) నిర్మాణం చేపట్టింది. తద్వారా చెత్తను ఒకచోటకు చేర్చి గ్రామాలను సుందరంగా మార్చాలనేది లక్ష్యం. ఇంతవరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కాకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు మళ్లీ మొదటికి వస్తున్నాయి. సేంద్రియ ఎరువుల తయారీలో ప్రగతి కనిపించడంలేదు. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

ఆసక్తి చూపితే పంచాయతీలకు మెరుగైన ఆదాయం



నిర్మాణం అలంకార ప్రాయం

- జిల్లాలో పంచాయతీలు: 566
- జనాభా: 12.45 లక్షలు
- మంజూరైన చెత్తదిబ్బలు: 566
- పూర్తయిన నిర్మాణాలు: 560
- కేటాయించిన నిధులు: రూ. 14.23 కోట్లు
- ఖర్చు చేసింది: రూ. 13.75 కోట్లు

ఒక్కోదానికి రూ.2.5 లక్షల ఖర్చు

పల్లెల్లో చెత్త లేకుండా చేసి స్వచ్ఛభారత్ స్ఫూర్తిని చాటేందుకు ప్రతి గ్రామ పంచాయతీలోనూ సేంద్రియ ఎరువు తయారీ షెడ్లను ఏడేళ్ల క్రితం వినియోగంలోకి తెచ్చారు. అందులో భాగంగా ఒక్కోదాని నిర్మాణానికి రూ.2.5 లక్షలు వెచ్చించారు. వీటిని సకాలంలో పూర్తిచేయాలని అప్పట్లో మండల స్థాయి అధికారులు, సర్పంచులపై జిల్లా ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. ఆ తరువాత మాత్రం దృష్టి పెట్టలేదు. కంపోస్టు షెడ్ల వినియోగంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గతంలో సేంద్రియ ఎరువు తయారీపై మండల, గ్రామ స్థాయిలోనూ అధికారులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించారు. తరువాత పట్టించుకోకపోవడంతో పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు.

ఇవీ కారణాలు..

- ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులు పట్టించుకోకపోవడం.
- సేకరించిన వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారబోసి కాల్చి వేయడం.
- చిన్నచిన్న పంచాయతీలకు నిధుల కొరత.

డిమాండ్ ఎక్కువే..

పశు సంతతి తగ్గిపోవడంతో గ్రామీణ నేపథ్యంగల జిల్లాలో సేంద్రియ ఎరువుల కొరత ఏర్పడింది. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో కొనుగోలు చేసి తీసుకువచ్చి పొలాల్లో వాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీలు సేంద్రియ తయారీని చేపట్టి అదనపు ఆదాయ వనరులను సమీకరించుకునేందుకు చక్కటి అవకాశం ఉంది. నిత్యం సేకరిస్తున్న చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఇందుకోసం లక్షలు వెచ్చిస్తున్నా పర్యావరణానికి మాత్రం మేలు జరగడం లేదు. గతంలో జిల్లాలోని కుల్కచర్లలో సేంద్రియ ఎరువును తయారు చేశారు. నిర్వహణ లోపంతో అది ఆరంభ శూరత్వంగానే మారింది. సేంద్రియ ఎరువులతో సంపద సృష్టిస్తున్న పంచాయతీలను ప్రభుత్వం ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



జిల్లా నాయకులతో రాష్ట్ర అధ్యక్షులు గోపి తదితరులు

బషీరాబాద్, న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీతో తీర్మానం చేయాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపి అన్నారు. బషీరాబాద్ మండలం ఎక్మాయిలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ డిమాండ్‌ను అసెంబ్లీలో ప్రస్తావించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రవీందర్, వర్కింగ్ అధ్యక్షులు అశోక్, ఎక్మాయి శ్రీనివాస్ స్వామీజీ, వెంకటయ్య, అనిల్, జగదీష్, ఆశప్ప, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుకు నేటి నుంచి వివరాల సేకరణ

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికో డిజిటల్ కార్డు ఇవ్వాలని, అందుకే వివరాలు పక్కాగా సేకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పర్యవేక్షణాధికారులకు శిక్షణలో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. నేటి నుంచి పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని ఓ పురపాలక సంఘాన్ని, గ్రామ పంచాయతీని ఎంపిక చేసి నోడల్ అధికారులు ఇంటింటికీ తిరిగి జనన, మరణ తదితర పూర్తి అంశాలతో వివరాలు సేకరించి, 8న పూర్తి చేయాలన్నారు. 9న పరిశీలన, 10న నివేదిక సమర్పించాలన్నారు. కుటుంబ సర్వే అంగన్‌వాడీ బోధకులకు తెలిసి ఉంటుందని, వారి సహకారంతో కుటుంబ ఫొటో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర, పురపాలక కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు



వ్యక్తిగత పనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ యూరప్ పర్యటనకు వెళ్లారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా యూరప్‌లోని ఎత్తయిన ఆల్ప్స్ పర్వత ప్రాంతంలోని జంగ్ ప్రాజోచ్ దగ్గర ల్యాప్‌టాప్‌లో గాంధీ చిత్రానికి నివాళి అర్పించారు.

శాంతి, సామరస్యతే గాంధీ మార్గం

వికారాబాద్, తాండూరు టౌన్, న్యూస్‌టుడే: శాంతి, సామరస్యం ద్వారా ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చనేదే గాంధీ మార్గం. స్వచ్ఛతకు పేరు గాంచిన గాంధీ జయంతి సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. * తాండూరులో సబ్ కలెక్టరు ఉమాశంకర్ మాట్లాడుతూ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి ప్రపంచానికి ఆదర్శప్రాయులన్నారు. * గాంధీ మార్గం అందరికీ అనుసరణీయమని జిల్లా పోలీసు అధికారి నారాయణరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు. అహింస మార్గం అనుసరణీయన్నారు.



పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర పోలీసులు



తాండూరులో.. సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అధికారులు

సెలవుల నేపథ్యం.. రద్దీకి ప్రత్యామ్నాయం

న్యూస్‌టుడే, తాండూరు, వికారాబాద్:

ఆర్టీసీ కార్యాచరణ

దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. నామమాత్ర రద్దీ ఉండే రూట్లలోని బస్సులను ఎక్కువ రద్దీ ఉండే రూట్లకు వీలును బట్టి తిప్పేందుకు కార్యాచరణ చేపట్టారు. పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలకు మంగళవారం నుంచి ఈనెల 14 వరకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి సొంత గ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బుధవారం మహాలయ అమావాస్య అయినప్పటికీ రద్దీ సాధారణానికి మించే కనిపించింది. ఈనెల 6 నుంచి 13 వరకు జూనియర్ కళాశాలల విద్యార్థులకు సెలవులను ప్రకటించబోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం వెళ్లే బస్సులను ప్రయాణికుల కోసం వినియోగించనున్నారు.



తాండూరు ప్రాంగణంలో ప్రయాణికుల రద్దీ

- ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు: 1,406
- విద్యార్థులు: 1.10 లక్షలు
- డిపోలు: మూడు (తాండూరు, వికారాబాద్, పరిగి)
- బస్సులు: 230
- ప్రయాణించే కిలో మీటర్లు: 90,096
- ఒక్కో బస్సులో వెళ్లే ప్రయాణికులు: 90 నుంచి 98 మంది
- రోజువారీ ఆదాయం: రూ.35 లక్షల నుంచి రూ.39 లక్షలు

100కుపైగా విద్యార్థుల బస్సులు

జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో నిర్ణీత రూట్లలో ఉదయం, సాయంత్రం 100కు పైగా బస్సులు విద్యార్థుల రాకపోకల కోసం వినియోగించేవే ఉన్నాయి. వీటిలో సాధారణ ప్రజలు ప్రయాణించేది నామమాత్రమే. ఇలాంటి బస్సులను ఆర్టీసీ అధికారులు దసరా సెలవుల్లో ప్రయాణికుల రద్దీని బట్టి ఆయా రూట్లలో తిప్పుతారు.

ఇబ్బందులేమీ ఉండవు

దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం సెలవు రోజుల్లో గ్రామాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థుల ప్రయాణాలు ఉండవు. ఇలాంటి బస్సులను ప్రయాణికుల రద్దీ ఉండే రూట్లలో నడుపుతాం. తాండూరు డిపో పరిధిలో 32 గ్రామాలకు విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా బస్సులు నడుస్తాయి. సెలవు రోజులు కాబట్టి ఇలాంటి బస్సులను రద్దీ రూట్లలో తిప్పుతాం.– కె.సురేష్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజరు, తాండూరు.

మాకొద్దీ.. మద్యం!



న్యూస్‌టుడే, దోమ: దోమ గ్రామంలో మద్య నిషేధానికి యువకులు, గ్రామపెద్దలు నడుం కట్టారు. మద్యం తాగి ఆర్థికంగా నష్టపోతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు, పెడదారి పడుతున్న యువకులను కళ్లముందే చూస్తూ వేదన చెందిన గ్రామస్థులు ఈ నిర్ణయానికి వచ్చారు. దోమ మండలం శివారెడ్డిపల్లి (ఎమ్మెల్యే టీఆర్ఆర్ స్వగ్రామం)లో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. మద్యం వల్ల దెబ్బతింటున్న కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ఇక మీదట ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని తీర్మానించారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి సాహెరా తీర్మానాన్ని ఆమోదించారు. మద్యం కొన్నవారికి రూ.20,000 జరిమానా తప్పదని హెచ్చరించారు. అలాగే విక్రయిస్తున్నా, కొంటున్నా వారి సమాచారం తెలిపిన వారికి రూ.10,000 నజరానా ప్రకటించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..



పరిగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, న్యూస్‌టుడే: మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ రాష్ట్రంలోనే పరిగి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.40కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రూ.25కోట్లతో ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తామని, రోడ్ల మరమ్మతు పనులకు రూ.100కోట్లు మంజూరవుతున్నాయన్నారు. రాష్ట్రానికే తలమానికంగా మారనున్న ఆర్ఆర్ఆర్‌ను పరిగి ప్రాంతం మీదుగా వెళ్లేందుకు సీఎంను ఒప్పించినట్లు చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్, సిద్ధాంతి పార్థసారథి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బరువు తూచే యంత్రాలు.. ఆసుపత్రికే పరిమితం

గర్భిణులు, చిన్నారుల బరువు ఎంత ఉన్నారని కొలిచేందుకు, ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలకు యంత్రాలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా పెద్దేముల్ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన యంత్రాలను ఉప కేంద్రాలకు అందించక వృథాగా పడేశారు. దీని వల్ల నెలనెలా గర్భిణులు, పిల్లల బరువు తూచే పరిస్థితి లేకుండా పోతోంది. అంతేకాదు పిల్లలకు సకాలంలో మాత్రలు అందించే వీలు కావడంలేదు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దేముల్.



కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

తాండూరు: పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటి కప్పుడు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని మున్సిపల్ అధ్యక్షురాలు స్వప్న అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయావరణలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. రక్త పోటుకు సంబంధించిన పరీక్షలు చేసుకుని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మణిపాల్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డాక్టర్లు ఆకాష్, అఖిల్, గిరిధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, పర్యావరణ ఇంజినీరు ప్రవీణ్‌గౌడ్, కౌన్సిలర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం అందరి బాధ్యత

తాండూరు టౌన్: గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్, మార్వాడీ యువ మంచ్, ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్త దాన శిబిరంలో పురపాలక సంఘం కమిషనరు విక్రమసింహారెడ్డి, అధ్యక్షురాలు స్వప్న రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. ఆపద సమయాల్లో బాధితులకు అవసరమయ్యే రక్తం అందించడం కోసం దానం చేయటం మన అందరి ధర్మంగా భావించాలన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయటానికి స్వచ్ఛందంగా సంఘాలు ముందుకు రావటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు సంతోష్ కుమార్, మన్‌మోహన్ సార్డా, భాను కుమార్ పాల్గొన్నారు.

ఈ కష్టాలు ఎన్నాళ్లు..



తరచూ కురుస్తున్న వర్షాలకు నవాబ్‌పేట మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామం నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే మట్టి దారి బురదతో నిండి నడవాలంటే కష్టంగా ఉంటోంది. పొలాల నుంచి ధాన్యం, కూరగాయలు తరలించాలంటే వాహనాలు ఇరుక్కుపోయి ముందుకు కదలటంలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నవాబ్‌పేట.

బుడిబుడి చిన్నారీ.. అందుకో ఏకరూపం

న్యూస్‌టుడే, పాత తాండూరు, బషీరాబాద్

వస్త్రం పంపిణీతో సిద్ధమవుతున్న దుస్తులు

బుడిబుడి చిన్నారులు ఇక నుంచి చక్కగా ఏకరూప దుస్తులతో చిన్నబడికి రానున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల మాదిరి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన చదువు నేర్చుకునే చిన్నారులకు ప్రభుత్వం వస్త్రం పంపిణీ చేసింది. స్థానికంగా ఉండే మహిళా సంఘాల సభ్యులకు, ఇతర దర్జీల ద్వారా ఏకరూప దుస్తుల కుట్టు పనులు సాగుతున్నాయి. దసరా తరువాత పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



పిల్లలు ధరించే అందమైన ఏకరూప దుస్తులు

3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ప్రయోజనం: చిన్నారులకు పౌష్టిహారాన్ని అందించడంతో పాటు ఆట పాటలతో ప్రాథమిక చదువు నేర్పించడానికి అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న 24,942 మంది 3-6 సంవత్సరాల పిల్లలకు ఏకరూప దుస్తులు అందజేయనున్నారు. ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (సెర్ప్) ఆధ్వర్యంలో దర్జీ (టైలర్)లకు వస్త్రం అందజేశారు. ఆకర్షణీయంగా బాలురకు షర్టు, నిక్కర్, బాలికలకు గౌను ఆకర్షణీయంగా డిజైన్ చేయడంతో అదే తరహాలో దర్జీలు కుడుతున్నారు. ఒక్కో జత కుట్టేందుకు రూ.80-100 చెల్లించనున్నారు. ఇప్పటికే 60శాతం కుట్టు పూర్తి కాగా, మిగతావి వారం రోజుల్లోగా అందజేయనున్నారు.

- జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు: 1107
- గర్భిణులు: 6,133
- బాలింతలు: 5,155
- 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు: 32,087
- కేంద్రాల్లో 3–6 ఏళ్లలోపు చిన్నారులు: 24,942

చక్కని డిజైన్‌తో కుడుతున్నాం

బషీరాబాద్ మండలానికి సంబంధించిన రెండు సెక్టార్ల చిన్నారుల చక్కటి డిజైన్‌తో ఏకరూప దుస్తులు కుట్టేందుకు సెర్ప్ అధికారులు పని అప్పగించారు. మొత్తం 650 మంది చిన్నారుల దుస్తులు కుడుతున్నాం. నాణ్యతగా కుట్టు వేస్తున్నాం. సగం దుస్తులు సెర్ప్ వారికి అప్పగించాం. – శ్రీశైలం, దర్జీ, దామర్‌చేడ్.

మంచి అనుభూతితో వస్తారు



అంగన్‌వాడీ చిన్నారులు ఏకరూప దుస్తులు ధరించి చక్కని అనుభూతితో కేంద్రానికి ఆసక్తిగా వస్తారు. ఏకరూప దుస్తుల పంపిణీతో పిల్లల సంఖ్య, హాజరుశాతం పెరిగే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లోని మూడేళ్లు దాటిని చిన్నారులందరికీ దుస్తులు అందజేస్తాం. దుస్తులు సైతం ఆకర్షణీయంగా, మన్నికగా కుట్టిస్తున్నాం. – క్రిష్ణవేణి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి, వికారాబాద్.

దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.రాజేందర్ పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో వర్గల్ నవోదయలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో చేరేందుకు ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, 11లో చేరేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ shttps://www.navodaya.gov.inలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025, ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: గంజాయి దమ్ము పీల్చుతూ జల్సాలకు అలవాటై దానిని ఇతరులకు అమ్ముతున్న యువకులను పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన శశివర్ధన్, షాదుల్, నివాస్, వారి స్నేహితులతో కలిసి హైదరాబాద్‌లో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొంటున్నారు. గంజాయిని బుధవారం సిద్దిపేటలోని కేసీఆర్‌నగర్‌లో విక్రయించే క్రమంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో శశివర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. షాదుల్, నివాస్ పరారయ్యారు. స్నేహితులు సురేశ్, రఘువంశీ, దయాకర్, లక్ష్మణ్, చాంద్‌పాషా, రోహిత్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1040 గ్రాముల ఎండు గంజాయి, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు.

దేవీ శరణం గచ్ఛామి

● నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం

ఆధ్యాత్మిక శక్తి.. ప్రపంచాన్ని ముందడుగు వేసేలా చేస్తోంది. శక్తికి మరోపేరు అమ్మవారు. అమ్మవారిని ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తే ధైర్యం ఆవహిస్తుంది. మంచి పనులకు మనసును పురిగొల్పుతుంది. నేటి నుంచి దశమి వరకు శరన్నవరాత్రోత్సవాల్లో దుర్గామాత, సరస్వతి మాత క్షేత్రాల్లో రోజుకో రకంగా దివ్యమైన పూజలు జరుగుతాయి. భక్తులు దీక్ష తీసుకొని మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి అర్చిస్తారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలోని ముఖ్య ఆలయాలు, మండపాలు వాటి ప్రత్యేకతలపై కథనం.


చిట్కుల్‌లో చాముండేశ్వరి

శాంతస్వరూపిణి

చిలిప్‌చెడ్: మంజీరా నదీ తీరంలో చాముండేశ్వరీ దేవి గుడి వెలిసింది. మెదక్ జిల్లా చిలిప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో శాంతిస్వరూపిణిగా చాముండి దర్శనం ఇవ్వడం విశేషం. నేడు మొదటి రోజున వేయి కడవల నది నీటితో అభిషేకిస్తారు. నిత్యం పారాయణాలు నిర్వహిస్తారు.

మహిళలే ముందుకు..

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కులాలతో సంబంధం లేకుండా సమష్టిగా ఉత్సవాల నిర్వహణ ఇక్కడి ప్రత్యేకత. నిమజ్జనం రోజు ప్రదర్శనలో మహిళలే భాగస్వామ్యులై కోలాటంతో శోభాయాత్ర చేపడతారు. మహంకాళి దేవాలయ ఆవరణంలో 26 సంవత్సరాలుగా నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. 90 మంది భక్తులు దీక్షలో ఉంటారు.


మహంకాళి మందిరం

గడికోట వైభవం

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని చారిత్రక శంకరమ్మ గడికోటలను కొన్నేళ్ల క్రితం గ్రామస్థులు మరమ్మతులు చేసి వాడుకలోకి తెచ్చుకున్నారు. అందులోభాగంగా గడికోట ఉత్సవ సమితిగా ఏర్పడి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. కోటలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. బోనాలు, ప్రస్తుత ఉత్సవాలతో ఈ కోట శిథిలం కాకుండా చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

తుంకిమెట్లలో పొయ్యి వెలగదు!

కొడంగల్, బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో రోజూ సామూహిక భోజనం ఉంటుంది. ఎవరింట్లోనూ వంటలు చేయరు. పదేళ్లుగా దుర్గామాత పూజల్లో ఆనవాయితీ ఇది. గ్రామంలో 1200 మంది జనాభా. నిమజ్జనం రోజు 300 మంది ఏకరూప దుస్తులతో విగ్రహాన్ని తరలిస్తారు.


పెద్దశంకరంపేటలోని గడికోట

అర్ధనారీశ్వరం విశేషం

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణం: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో నాలుగో రోజున అర్ధనారీశ్వరి అలంకరణ ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచింది. నేటి నుంచి వరుసగా బాలాత్రిపురసుందరి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి, అర్ధనారీశ్వరి, లలితాంబిక, అన్నపూర్ణ, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, సంతోషిమాత అవతారాల్లో దర్శనం లభిస్తుంది.


గజ్వేల్ సంతోషిమాత

ఏడుపాయల్లో ఆధ్యాత్మిక పరవళ్లు

పాపన్న పేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఉత్సవశోభను సంతరించుకుంది. సమీపంలోని గోకుల్ షెడ్‌లో అర్చనలు కొనసాగుతాయి. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నేడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారిని రోజూ వివిధ అవతారాల్లో భక్తులు దర్శించుకుంటారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దసరా రోజు 15 వేల మందికి పైగా దర్శించుకుంటారు. ఏటా సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల ఉంటుంది. ఈ సమయంలో రాజగోపురంలోనే పూజలు జరుగుతున్నాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 8000 క్యూసెక్కుల వరద దిగువకు బుధవారం ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ప్రవాహం మరింత పెరగనుందని ఆయన తెలియజేశారు.


వనదుర్గమ్మ

కమనీయ రూపాలు ›››

▼ మొదటి రోజు శైలపుత్రి ▼ రెండో .. బ్రహ్మచారిణి ▼ మూడో .. చంద్రఘంట ▼ నాలుగో .. కూష్మాండ ▼ ఐదో .. స్కంధమాత ▼ ఆరో .. కాత్యాయని ▼ ఏడో .. కాళరాత్రి ▼ ఎనిమిదో .. మహాగౌరి ▼ తొమ్మిదో .. సిద్ధిధాత్రి ▼ పదో .. రాజరాజేశ్వరి

గతేడాది వాహన పూజలు

ద్విచక్ర .. 100
నాలుగు చక్రాలవి 50
భారీవి .. 20

గతేడాది ప్రసాదాల విక్రయం

లడ్డూలు - 3000 పులిహోర - 2000

ప్రత్యేక పూజలు ›››

- రోజూ ఉదయం 9:30 గంటలకు అర్చనలు ప్రారంభం
- 6వ రోజున మూల నక్షత్రం సందర్భంగా మంగళవారం బోనాలు సమర్పిస్తారు.
- 9వ రోజున మహర్నవమి నేపథ్యంలో సువాసిని పూజ, చండీ హోమం నిర్వహిస్తారు.
- నిత్యం అన్నదానం చేపడతారు.

సరస్వతి నమస్తుభ్యం

వర్గల్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతి క్షేత్రంలో సరస్వతి నమస్తుభ్యం మంత్రోచ్ఛారణ మార్మోగనుంది. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం కలశ స్థాపన జరుగుతుంది. 9న మూల నక్షత్రం సందర్భంగా పుష్పగిరి, రంగంపేట, శ్రీక్షేత్రం పీఠాధిపతులు అమ్మవారికి పూజలు నిర్వహించి అనుగ్రహ భాషణం చేయనున్నారు.


వర్గల్ విద్యాధరి

ఆలోచనకు పెద్దపీట ›››



‘ఉపాయం వచ్చినోడు.. ఉపాసం ఉండడు’ ఈ సామెతను చిన్నారులు నిజం చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో బరువైన పెద్దపీటను కొందరు చిన్నారులు ఓవైపు మోస్తూ మరోవైపు భాగాన్ని సైకిల్‌పై పెట్టి తరలిస్తున్నారు. గణపతి వేడుకలు ముగిసి అమ్మవారి శరన్నవారోత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేశారు. అవసరానికి పీటను ఒకచోట నుంచి మరోచోటకు చేర్చడానికి చిన్నారులు ఇలా ఆలోచన చేశారు. స్థానికులు చూసి ‘భళా పిల్లలు.. భలే చేశారు’ అని మెచ్చుకున్నారు. - న్యూస్‌టుడే, చేర్యాల

లారీని ఢీకొన్న స్కార్పియో.. ఒకరి దుర్మరణం


జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి స్కార్పియో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని మాడిగి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ముంబయి వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం మొగుడంపల్లి మండలం మాడిగి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. స్కార్పియోలో వెనుక కూర్చున్న హైదరాబాద్ టోలిచౌకికి చెందిన ఆబెద్ కుర్షిద్(50) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

సంపులో పడి బాలుడి మృతి


రుద్రాన్ష్


చిన్నకోడూరు, న్యూస్‌టుడే: ఒక్కగానొక్క కొడుకు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి కళ్లెదుటే మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన చిన్నకోడూరు మండలంలోని మైలారం మధిర గ్రామం కమ్మర్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. కమ్మర్లపల్లికి చెందిన బైకని వేణు, రేణుక దంపతులకు ముగ్గురు కుమార్తెలు, మూడున్నరేళ్ల కుమారుడు రుద్రాన్ష్ ఉన్నారు. వారం రోజుల క్రితం వేణు తన ఇంటి ఆవరణలో సంపు నిర్మించి నీటితో నింపాడు. దాని పై కప్పు వేయలేదు. రుద్రాన్ష్ బుధవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. సుమారు గంట తర్వాత బాలుడు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు వెతకగా సంపులో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో బాలుడిని బయటకు తీసి చూసే సరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఓ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింహులు

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ పట్టణం అవుసులపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఏఎస్ఐ శివకుమార్ తెలిపిన ప్రకారం పట్టణానికి చెందిన బొయిని నర్సింహులు (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. బుధవారం పొలం గట్టుపై నడుస్తుండగా, కాలు జారడంతో పక్కనే ఉన్న విద్యుత్ నియంత్రిక సపోర్ట్ తీగను పట్టుకున్నాడు. అదే సమయంలో కరెంట్ సరఫరా అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. నర్సింహులుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు...


మోహన్

టేక్మాల్, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రం పక్కన ఉన్న గుంతలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లాస్‌పూర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాలు.. టేక్మాల్‌కు చెందిన బాజ మోహన్(29) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం పొలాల పక్కన గుంతలో పడి మృతి చెందిన విషయం స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు తెలిసింది. రోడ్డు పక్కన మోహన్ ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. వాహనంపై రక్తపు మరకలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

స్టార్టప్‌తో ముందంజ

దుబ్బాక, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రపంచంలో శాస్త్ర సాంకేతికత రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నేడు చదువుకున్న యువత కొత్తగా ఆలోచిస్తున్నారు. ఉద్యోగాల వేట కంటే ఈతరానికి అనుగుణమైన వ్యాపారాలు చేపడుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌ల పేరుతో సరికొత్త స్టార్టప్ కంపెనీలు ప్రారంభిస్తూ సఫలమవుతున్నారు. అలాంటి కోవలోకి చెందిన వారు.. సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు సోదరులు. దుబ్బాక పట్టణానికి చెందిన కిష్టమ్మగారి సందీప్‌రెడ్డి, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన నిమ్మ నిఖిల్‌రెడ్డి వరుసకు సోదరులు. వీరు రైతు కుటుంబాలకు చెందిన వారు. సందీప్‌రెడ్డి.. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. నిఖిల్‌రెడ్డి ఎమ్మెస్సీ బోటనీ చదివారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక వీరు భిన్నంగా ఆలోచించి, ఈ-కామర్స్ రంగంలో పోటీ పడాలనే ఆలోచన చేశారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని సుచిత్ర కేంద్రంగా ‘బూకార్ట్ ట్రేడింగ్ స్టోర్స్’ (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ప్రారంభించారు. దాదాపు రూ. 12 లక్షల బ్యాంకు రుణంతో ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేసి, షాపింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫ్యాషన్ రంగానికి సంబంధించి దుస్తులు, చెప్పులు ఆర్డర్స్ ద్వారా చేయించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. విక్రయించేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 1500 ఆర్డర్లు వచ్చాయన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని వస్తువులను ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని వారు చెప్పారు. కొద్ది రోజుల్లో కంపెనీ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులను 3, 4 రోజుల్లో వివిధ కొరియర్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటికి పంపిస్తున్నారు. వస్తువులకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్, యూపీఐ ద్వారా చెల్లుబాటు అయ్యేట్లు అనుమతులు తీసుకున్నామని చెప్పారు. నాణ్యమైన వస్తువులను అందించే లక్ష్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించామని తెలిపారు. సొంత కాళ్లపై నిలబడి, తాము ఎదుగుతూ తమతోపాటు మరికొందరు యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించామని.. విస్తరిస్తామని చెప్పారు. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలనే ఆలోచన ఉన్నవారికి ఉచితంగా సూచనలు, సహకారం అందిస్తామంటున్నారు.


సందీప్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి

పూలవనం.. ఆనందమయం ›››



వికారాబాద్ మండలంలోని తట్టేపల్లి వెళ్లే మార్గంలో ఓ రైతు పొలంలో కాశ పూలు, బంతి పూల తోట విశేషంగా చూపరులను ఆకట్టుకుంటోంది. వివిధ రంగులతో అలరిస్తూ బతుకమ్మల రూపకల్పనలో మారేందుకు సిద్ధమయ్యాయి. పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాయి. - న్యూస్‌టుడే, పెద్దేముల్



అతివల ఏకరూపం.. బతుకమ్మల సంబురం

తీరొక్క పూలు తెచ్చి ఆకర్షణీయంగా బతుకమ్మలను మహిళలు పేర్చారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆడిపాడారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని బస్టాండు కాలనీ మహిళలు తాము ప్రత్యేకంగా నిలవాలనే ఉద్దేశంతో ఏకరూప చీరలు ధరించి బతుకమ్మ ఆడారు. - న్యూస్‌టుడే, నంగునూరు

భాస్కరయోగికి సాహిత్య పురస్కారం



పరిగి, న్యూస్‌టుడే: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఏటా అందించే పురస్కారానికి ఆధ్యాత్మిక వేత్త, రచయిత, సామాజిక విశ్లేషకుడు పి.భాస్కరయోగి ఎంపికయ్యారు. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఆయనకు ఈనెల 4న హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పాకాల యశోదారెడ్డి ధర్మనిధి పురస్కారం ప్రదానం చేయనున్నారు. తెలంగాణ సాహిత్య చరిత్రలో చోటు దక్కని 300 మంది వాగ్గేయకారుల కీర్తనలను, జీవితాలను ఆయన పరిశీలించి సాహిత్య లోకానికి ఆయన పరిచయం చేశారు. తెలంగాణ పద సంకీర్తనల పేరుతో సాహిత్య అకాడమీ ఆ పుస్తకాన్ని ప్రచురించింది. సాహిత్య సౌరభాలు పేరుతో ఆయన పరిశోధనాత్మక గ్రంథం వెలువడింది.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


నరేష్

నిజాంపేట, రామాయంపేట, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దండు నరేశ్(42) గతంలో దుబాయ్‌కి వెళ్లాడు. ఇటీవల ఇంటికి తిరిగివచ్చాడు. అప్పులు తీర్చలేక, స్థానికంగా పని దొరక్క మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 1న పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరేశ్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నర్సు ఆత్మహత్య: శివ్వంపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లిలో యువతి ఆత్మహత్య చేసుకుంది. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల అంజలి(21) మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా చేస్తోంది. ఆమెకు తల్లి, సోదరుడు, ఇద్దరు అక్కలు ఉన్నారు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి కూలీ పనులు చేస్తుంటారు. నలుగురు సంతానంలో అంజలి అందరికంటే చిన్న. మంగళవారం దంతాన్‌పల్లిలో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి సత్తమ్మ వెళ్లి చూడగా ఇంటి ముందున్న చెట్టుకు చున్నీతో ఉరి వేసుకొని కనిపించింది. యువతి మృతికి కారణాలు దర్యాప్తులో తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు. ఆమె సోదరుడు ఆనంద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.


అంజలి

మంత్రాల నెపంతో కుటుంబ సభ్యులపై దాడి

రామాయంపేట, న్యూస్‌టుడే: మంత్రాల నెపంతో మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం విజయ భర్త సిద్ధిరాములు అదే గ్రామానికి చెందిన పున్న చంద్రం ఇంటి వద్ద చెట్టు కింద నిమ్మకాయలు, పసుపు, కుంకుమ పెట్టి మంత్రాలు చేస్తున్నారని ఆగ్రహించి బుధవారం పది మంది విజయపై దాడి చేశారు. అడ్డు వచ్చిన భర్త సిద్ధిరాములు, వారి కుమారుడినీ కొట్టారు. అనంతరం వారిని చెట్టుకు కట్టేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకొని వారిని కాపాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

ఖైదీల్లో మార్పునకు జైళ్ల శాఖ కృషి


ఖైదీకి బహుమతి అందజేస్తున్న జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీల్లో మార్పునకు జైళ్లశాఖ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆ శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా కందిలోని కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖైదీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ పెట్రోల్ బంకులు, పరిశ్రమలు నిర్వహిస్తోందని, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, జైళ్ల శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో ఇషాన్ ప్రతిభ



సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో సిద్దిపేట శ్రీసాయి స్కేటింగ్ అకాడమీకి చెందిన చిన్నారి కంచర్ల ఇషాన్ సత్తా చాటాడు. అండర్-7 విభాగంలో 500 మీటర్ల క్వాడ్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 4వ తేదీ నుంచి భువనగిరిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడని శిక్షకుడు సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు యువజన క్రీడల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్‌గౌడ్, సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం, జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి అరవింద్, ఉపాధ్యక్షుడు పల్లె చంద్రశేఖర్‌గౌడ్, కార్యదర్శి సంతోష్ ఇషాన్‌ను అభినందించారు.

‘హ్యాండ్‌బాల్’కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు హుస్నాబాద్ జడ్పీ బాలుర ఉన్న పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 3 నుంచి 5 తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్ల తరఫున ఆడనున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఎం.శివబాలాజీ బాలుర విభాగంలో, కె.ప్రశాంత బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పీడీ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, పురాధ్యక్షురాలు రజిత, ఎంఈవో మనీలా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆకునూరు బాలలు


విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు

చేర్యాల, న్యూస్‌టుడే: ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీల్లో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆకునూరులో చిన్నారులు ఎం.సాత్విక, సీహెచ్. భార్గవి, వి.శిరీష, టి.దివ్యశ్రీని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత ఆకాంక్షించారు.

యోగా శిక్షణ.. ఆరోగ్య రక్షణ

న్యూస్‌టుడే, నర్సాపూర్: సంపూర్ణ ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత.. యోగాతోనే సాధ్యం. సరైన సూచనలు, సలహాలు పాటిస్తూ సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చని అంటున్నారు యోగా సాధకులు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిత్య జీవన యోగాసాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనం కేంద్రంగా చేసుకుని ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ సాధన చేస్తున్నారు. సుమారు 40 మంది క్రమం తప్పకుండా యోగాసానాలు వేస్తున్నారు. ఇటీవల నర్సాపూర్ అర్బన్ పార్కులోని వాచ్ టవర్ వద్ద యోగా శిబిరం చేపట్టారు. రాయరావు చెరువు కట్టపైనా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ యోగా చేస్తున్నారు. వారంతా సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. పట్టణంలో శాకాహార ర్యాలీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నారు.


నర్సాపూర్ చెరువు కట్టపై శిబిరం

కేంద్రం ఏర్పాటుకు యత్నం

సమితి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో యోగా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎకరం విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సహకారం తీసుకోవాలని యోచిస్తున్నారు. రాయరావు చెరువు కేంద్రంగా దీని ఏర్పాటుకు ప్రతిపాదనలు అధికారులకు అందించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో నీటి వనరు వద్ద, చల్లని గాలులు, ప్రకృతి సహజ సిద్ధమైన వాతావరణంల నెలకొల్పే ఉద్దేశంతో కేంద్రం కోసం ప్రయత్నిస్తున్నారు.

గురువుగా విశ్రాంత ఉద్యోగి

శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన యోగా గురువు సురేందర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విశ్రాంత ఉద్యోగి. రెండు దశాబ్దాల నుంచి ఆసక్తిని పెంచుకున్నారు. వివిధ యోగా సంస్థల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం యోగా గురువుగా ఆయన తన ప్రస్థానం ప్రారంభించారు. సుమారు 500 పైగా శిక్షణలు చేపట్టారు. సుమారు రెండు వేల మందికి పైగా ఆయన వద్ద శిక్షణ పొందారు. 15 మంది శిక్షకులయ్యారు. వారు స్వతహాగా యోగా శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, ప్రైవేటు సంస్థలలో ఉచితంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం నర్సాపూర్‌లో శిక్షణ కేంద్రం నిర్వహిస్తూ, విజన్ వృద్ధాశ్రమం, మద్యానికి బానిసలైన వారి పునరావాస కేంద్రంలో యోగా తరగతులు చేపడుతున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సారథి పేరుతో ప్రభుత్వ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశారు. కపాలబాతి, ప్రాణాయామం వంటి ఆసనాలు వేయించడంలో ప్రత్యేకత చూపుతున్నారు. యోగా సాధనపై ముందుగా అవగాహన కల్పించి ప్రారంభింపచేస్తారు. గురువు సురేందర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా భాగం కావాలని ఆకాంక్షించారు. ఆరోగ్య రక్షణకు ఇది దోహదపడుతుందన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభకు పదును పెట్టండి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభకు పదును పెట్టడం వల్ల వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు బొలిసెటి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని సూపర్-8 క్రికెట్ పోటీల సీజన్-6ని మాజీ సర్పంచి సౌమ్యారెడ్డి, బాబా, కాంగ్రెస్ నాయకులు చంద్రలింగం, కమ్మరి స్వామి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత

కొడంగల్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడిని అమ్మనాన్న ఫౌండేషన్ సభ్యులు ఆదరించారు. రోడ్డుపై దుర్భరంగా జీవనం సాగిస్తున్న ఓ వృద్ధుడి వివరాలు తెలుసు కొన్నారు. యాలాల మండలం చెన్నారం గ్రామానికి చెందిన భీమప్పగా గుర్తించారు. అతడి కుమారుడైన కృష్ణను పిలిచి అందరి సమక్షంలో అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో పెద్దల అమావాస్య

పూడూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో బుధవారం పెద్దల అమావాస్యను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇళ్లల్లో ప్రత్యేక తీపి వంటకాలు చేసుకుని మధ్యాహ్నం నుంచి పూర్వీకుల ఫొటోల ముందు నైవేద్యాలు సమర్పించారు. పూర్వీకుల నుంచి ఆశీర్వాదాలు కోరుతూ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నేటి తరాలను చల్లగా చూడాలని వేడుకున్నారు.

నేడు ఆలయ సంఘం ప్రమాణస్వీకారోత్సవం

కొత్లాపూర్(తాండూరుగ్రామీణ), న్యూస్‌టుడే: కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ సంఘం నూతన అధ్యక్షుడు పట్లోళ్ల నవీన్‌రెడ్డితోపాటు కార్యవర్గ బృందం ప్రమాణ స్వీకారోత్సవాన్ని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ ఈవో శేఖర్‌గౌడ్ తెలిపారు.

దీపం వెలగదు.. దారి కనపడదు

జాతీయ రహదారిపై 30కి.మీ. ఇదే తీరు

న్యూస్‌టుడే, పరిగి, కొడంగల్:

బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారి పేరు వినగానే వణుకు పుడుతోంది. నిత్యం ఇది ప్రమాదాలకు కారణంగా మారడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. క్షణం తీరిక లేకుండా వెళ్తున్న వాహనాలతో పట్టణ వాసులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మితిమీరిన వేగంతో దూసుకువెళ్లడంతో ఎప్పుడు ఉపద్రవం ముంచుకువస్తుందో తెలియని భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రహదారి కొడంగల్ పట్టణం మీదుగా రెండు కిలో మీటర్లు, పరిగి మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారిపై కిలోమీటరుకు 30 వీధి దీపాలను కొడంగల్ పరిధిలోని రావులపల్లి, కొడంగల్, రేగడి మేల్వార్, తుంకిమెట్ల, పరిగి, రంగాపూర్ ప్రాంతాల్లో అధికారులు ఏర్పాటు చేశారు. కానీ అవి నెలల తరబడి వెలగడం లేదు. దీంతో అంధకారంతో దీంతో వాహన చోదకులు నిత్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిగిలోని హైదరాబాద్ రోడ్డు, కొడంగల్ రోడ్డులో పాఠశాలలతో పాటు వసతి గృహాలు, కల్యాణ మండపాలు, పెట్రోల్ పంపు, ఆసుపత్రులు, మందుల దుకాణాలు, పలు హోటళ్లు కూడా ఉన్నాయి. దీంతో ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటోంది. చీకటి పడితే చాలు వీధి దీపాలు పనిచేయక పోవడంతో చీకట్లు అలముకుంటున్నాయి. వీధి దీపాల నిర్వహణ బాధ్యత గాడి తప్పుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవలి కాలంలో జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.



కొడంగల్‌లో అలంకార ప్రాయంగా వీధి దీపాలు

పర్యవేక్షణ కొరవడి

జాతీయ రహదారిపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రమాదాల నివారణలో భాగంగా రోడ్డు మధ్యలో విద్యుద్దీపాలతో పాటు ఇనుప డివైడర్లను ఏర్పాటు చేశారు. కొందరు స్థానికులు రోడ్డు దాటేందుకు ఎక్కడికక్కడ పడితే అక్కడ అడ్డుగా ఉన్న ఇనుప చువ్వలను విరగ్గొడుతున్నారు. దీంతో అటు నుంచి ఇటు నుంచి అటు రోడ్డును ఇష్టానుసారంగా రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలోనూ పులువురు గాయపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అడ్డూ అదుపూ లేకపోవడంతో రోజుకో చోట వాటిని తొలగిస్తున్నారు. వాహనాలు ఢీకొని దెబ్బతిన్న వాటిని కూడా సరిచేయకుండా వదిలేస్తున్నారు. ఇది కొందరికి మరింత అనువుగా మారింది. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు డివైడర్లు దాటుతున్న వారు కనిపించడం లేదు. ప్రమాదకారిగా మారిన వాటిని గుర్తించి బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.



పరిగిలో చీకట్లు

వెంటనే బాగు చేయిస్తాం

ఇప్పటి వరకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు తమకు ఇప్పటివరకు వీటి నిర్వహణ అప్పగించలేదు. అయినా సమస్య పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తాం. హైవే కాకుండా పట్టణంలో ఎక్కడ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరిస్తాం. రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్లను వంచడం లేదా విరగ్గొట్టడం, కట్ చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- శరత్‌చంద్ర, ఏఈ, నేషనల్ హైవే అథారిటీ

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి: 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: ? వెంకటేశ్వర కాలనీ వీధుల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయటం లేదు. –నవీన్, తాండూరు.

✔ కాల్వలు శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకుంటాం. – విక్రమసింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? హన్మానాయక్ తండాలో సోలార్ మోటార్ పంపు పాడైపోయి చాలా రోజులు కావస్తోంది. – శంకర్, స్థానికుడు

✔ సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా మరమ్మతులు చేయించేలా చూస్తాం. – నర్సింలు, పంచాయతీ కార్యదర్శి.

న్యూస్‌టుడే, ధారూర్: ? గ్రామంలో పూర్తి స్థాయిలో సిమెంటు రోడ్డు, అంతర్గత మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. – నర్సింలు, తిమ్మనగర్

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేస్తాం. – అంజానాయక్, పంచాయతీ కార్యదర్శి ధారూర్

మహిళలకు ఆర్థిక చేయూత

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: కుటుంబ పెద్దలను కోల్పోయిన మహిళలకు కిసాన్‌బంధు వారి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలుగా తల్లిదండ్రులు లేని అనాథలకు, రైతు కుటుంబాలకు, ఒంటరి మహిళలకు కిసాన్‌బంధు వారు చేదోడు వాదోడుగా ఉంటు ముందుకు నడిపిస్తున్నారు. బుధవారం పేద కుటుంబాలకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్, గోపాల్, అనిల్, శ్రీహరి, కాశీపతి పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి



తాండూరులో శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్



కొడంగల్‌లో మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా మహాత్ముడి చిత్రపటాలకు ఘనంగా నివాళ్లు అర్పించారు. అన్ని పంచాయతీలు, మండల కార్యాలయాల్లోనూ అధికారులు, అనధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, దళిత, హక్కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్‌తోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రోగులకు, పేదలకు పండ్లు పంచిపెట్టారు. గ్రామ సభల్ని నిర్వహించి స్వచ్ఛతపై దృష్టి సారించారు. మన్‌కీ బాత్ రేడియోల్లో ప్రసారం కావడంతో చాలా గ్రామాల్లో ఆసక్తిగా విన్నారు. గాంధీజీ బోధనల్ని నాయకులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. **- న్యూస్‌టుడే, బృందం**



పరిగిలో నివాళులర్పిస్తున్న మహేష్‌రెడ్డి



తాండూరు గాంధీ కూడలిలో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు స్వప్న, కౌన్సిలర్లు

'కుల అణచివేత అంతమే లక్ష్యం'

యాలాల, న్యూస్‌టుడే: కుల అణచివేతను అంతం చేయడమే లక్ష్యంగా కేవీపీఎస్ లక్ష్యంగా పని చేస్తుందని జిల్లా కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. బుధవారం యాలాల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని ఆటోస్టాండ్ కేవీపీఎస్ జెండాను ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నర్సింలు, యాదప్ప, చిన్నయ్య, పల్లె శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నివాళులు అర్పించిన కేవీపీఎస్ నాయకులు ఉప్పలి మల్కయ్య

జొన్న.. ఉపాధిలోనూ మిన్న

రొట్టెల తయారీతో ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, కొడంగల్, పరిగి, (బొంరాస్‌పేట), దౌల్తాబాద్: మహిళలు ఉపాధి పొందేందుకు ప్రతి చిన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, పరిగి తదితర ప్రాంతాల్లో జొన్నలు విరివిగా పండడంతో చాలా కుటుంబాల్లో వాటితోనే ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. రోటీలు తయారు చేసి, వాటిని మార్కెటింగ్ చేసుకుంటున్నారు. ఈ మూడు ప్రాంతాలు కలిసి దాదాపు 50 నుంచి 60 కుటుంబాలు కేవలం అమ్మకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు.



రొట్టెలు చేస్తున్న మహిళ

ఇక్కడే ప్రత్యేకం..: కర్ణాటకకు సరిహద్దుగా ఉన్న కొడంగల్ తదితర ప్రాంతాల్లో తెల్లజొన్నలకు ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంతంలో నల్లరేగడి పొలాలు ఉండటంతో వాటిని అధికంగా పండిస్తారు. పైగా ఈ ప్రాంతం ప్రజలు జొన్నలు తక్కువగా పండిన సమయంలో కర్ణాటక నుంచి పెద్దఎత్తున దిగుమతి చేసుకొంటారు. ఇక్కడి నుంచే హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వాటిని తరలిస్తారు. తాజాగా తెల్ల జొన్న రొట్టెల తయారీ ప్రస్తుతం కొడంగల్ ప్రత్యేకత సంతరించుకుంది. మున్సిపల్ పరిధిలోని సంతబజార్, ఇంద్రానగర్, శాంతినగర్ కాలనీలోని మహిళలతోపాటు పలు హోటళ్లలో, అంబేడ్కర్ కూడలిలో నాలుగు చక్రాల తోపుడు బండ్లపై తయారు చేస్తున్నారు. ఇందులో ఇంద్రానగర్, శాంతినగర్, సంత బజార్ ప్రాంతంలో తయారు చేసే మహిళలు ఇంట్లో ఉండి తయారు చేసి కొడంగల్, రావల్‌పల్లి, కోస్గి, పరిగితో పాటు ఇతర ప్రాంతాలకు తయారు చేసి విక్రయిస్తున్నారు. దీంతో వచ్చే డబ్బులతో కుటుంబ పోషణ వంటి వాటిని చేసుకొంటున్నారు.

ఇంట్లో కొంటే రూ.10..: ఇంట్లో తయారు చేస్తున్న మహిళలు ఒక జొన్న రొట్టెలను రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక హోటల్స్‌లో తయారు చేసే మహిళలు రొట్టెతో పాటు రెండు రకాల కూరగాయాలు ఇవ్వడం వలన ఒక రొట్టె రూ.30కి విక్రయిస్తున్నారు. బీపీ, షుగర్ ఇతర రోగులు రొట్టే తినేందుకు బారులు తీరుతున్నారు.

రోజుకు 300 విక్రయిస్తున్నాం

ప్రతి రోజూ వేడివేడిగా రొట్టెలకు తీసుకొని వెళ్లేందుకు చాలా మంది వస్తున్నారు. ప్రతి రోజూ గరిష్ఠంగా 300 వరకు విక్రయిస్తున్నాం. ఇందులో తెల్లజొన్న, తైద, పచ్చజొన్నవి విక్రయిస్తున్నాం. ముగ్గురం కలసి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అమ్ముతుంటాం.

–బిచ్చమ్మ, గుండ్లకుంట

ఇతర ప్రాంతాలకూ..

నిత్యం పట్టణంలోని హోటళ్లతో పాటు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఇక్కడే నాణ్యమైన రోటీలు లభించడంతో పెద్దఎత్తున కొనుగోలు చేసి తీసుకొని వెలుతున్నారు. చాలా రోజులు నిల్వ ఉంచుకుంటున్నారు. ఒక్కదాన్నే దాదాపు వంద వరకు తయారు చేసి అమ్ముతున్నాను.

– సోమ్లిబాయ్, జుంటిపల్లి

గ్రామాభివృద్ధికి పన్నుల చెల్లింపు తప్పనిసరి

దోమ, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి పన్నులు చెల్లించాలని ఎంపీఈవో సోమలింగం అన్నారు. బుధవారం దోమ మండలం పాలేపల్లి, దోమ, మోత్కూర్ తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడారు. కుళాయిలకు బిరడాలు లేక నీరంతా వృథా అవుతుందని గ్రామస్థులు తెలుపగా అలాంటి వారికి నీటిని నిలిపివేస్తామని మూతలు బిగించాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామస్థులు సూచించిన పనులను తీర్మాణించి ఆమోదించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యదర్శి సంతోష పాల్గొన్నారు.



పాలేపల్లిలో నిర్వహించిన గ్రామసభ

పరిగి గ్రామీణ: ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూస్తామని ఎంపీడీవో ఎం.ఎ.కరీం అన్నారు. బుధవారం పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం సాలిపూలబాట తండా, సొండేపూర్, రంగంపల్లి, రూప్‌ఖాన్‌పేట్ తదితర గ్రామాల్లో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా వంట గ్యాస్ లబ్ధిదారుల పత్రాలను పంపిణీచేశారు.

వికారాబాద్ గ్రామీణ: గ్రామాల్లోని ప్రజలు ఎవరి ఇంటి చుట్టుపక్కల వారు శుభ్రం చేసుకోవడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటుందని మండల అభివృద్ధి అధికారి వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం సిద్దులూరు గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . పంచాయతీ సిబ్బందిదే బాధ్యత అనుకోకుండా గ్రామ అభివృద్ధి అందరి బాధ్యతగా గుర్తించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పల్లె దారిలో.. జర పైలం

ప్రమాదకరంగా తేలిన కంకర

న్యూస్‌టుడే, పూడూరు:

ఏళ్లుగా అసంపూర్తిగా మారిన రోడ్లతో పల్లె ప్రయాణం కష్టంగా మారింది. ఎక్కడ చూసినా విపరీతమైన గుంతలు, తేలిన కంకర, మట్టి దారులు వర్షం పడితే బురదమయం ఇలాంటి దారుల్లో గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే జనాలకు ఇబ్బందులు తప్పటం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఇంకా కొన్ని గ్రామాలకు బీటీ రోడ్లు లేవు. రెండేళ్లకు సంబంధించి పంచాయతీ రాజ్ నుంచి గత ఏడాది పూడూరు మండలానికి 15 పనులకు రూ.13.9 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కొన్ని గ్రామాలకు రీబీటీ వేయటం, కొత్తగా బీటీ వేయటం, మరమ్మతులు చేయటం, కల్వర్టుల నిర్మాణం చేయటం కోసం ఖర్చు చేయాల్సి ఉంది. చాలా గ్రామాలకు పనులు ప్రారంభించారు. అప్పట్లో ఎన్నికల నియమావళి అమల్లోకి రావటంతో ఎక్కడికక్కడ పనులు నిల్చిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది. పూడూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 44 గ్రామాలు ఉన్నాయి. నిత్యం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వందలాదిగా రాకపోకలు సాగిస్తారు.

సమస్యలు కొన్ని

- సోమన్‌గుర్తి గేటు నుంచి సిరిగాయపల్లి వైపు రెండున్నర కిలోమీటర్లు ఉంటుంది. పంచాయతీ రాజ్ పరిధిలో ఇంతకు ముందు బీటీ వేశారు. చాలా కాలం కావటంతో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రీబీటీ కోసం గత ఏడాది తవ్వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.
- చన్‌గోముల్ నుంచి కద్మూరు వెళ్లే ప్రధాన దారిలో రీబీటీ కోసం గుత్తేదారు ఉన్న రోడ్డును తవ్వేసి కంకర పరిచి వదిలేశాడు. ఏడాదిన్నర కావస్తున్నా.. పనులు ముందుకు సాగటం లేదు. ఇంతకు ముందు ఉన్న గుంతల రోడ్డు అయినా బాగుండేదని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- రేగడిమామిడిపల్లి నుంచి చన్‌గోముల్ ప్రధాన రహదారి పంచాయతీ రాజ్‌పరిధిలోకి వస్తుంది. కొత్తగా బీటీ వేయటంతో పాటు మధ్యలో వంతెన నిర్మాణం కోసం ఆరు నెలల కిందట పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణ పనులు కొలిక్కి రాలేదు. వర్షాలు కురిస్తే ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి మొరాయిస్తున్నాయి.
- మేడికొండ నుంచి పూడూరు గేటు వరకు ప్రధాన రహదారి. బీటీ రోడ్డు అయినా ఇది గుంతలు ఏర్పడటంతో రీ బీటీ కోసం నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారు ఉన్న రోడ్డును తొలగించి ప్రస్తుతం కంకర పరిచి వదిలేశారు.
- ఎన్కెపల్లి నుంచి మన్నెగూడ రెండున్నర కిలోమీటర్లు అవుతుంది ఇక్కడ రీబీటీ పనుల కోసం ఏడాది కిందట తవ్వేశారు. వాగు ప్రదేశంలో వర్షాలకు బురదమయంగా మారుతుంది.

పండుగ తరువాత పనులు

గ్రామాలకు ప్రధాన రహదారులను బాగు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ ద్వారా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పాత రోడ్డును తవ్వేసి కొన్ని రహదారుల్లో కంకర పోశారు రీబీటీ పనులు చేపట్టాల్సి ఉండగా జాప్యం జరిగింది. సంబంధిత గుత్తేదారులకు వివరించి దసరా పండుగ తర్వాత పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయించే విధంగా చూస్తాం. **సుందర్ ఎంపీవో, పూడూరు**



కండ్లపల్లి దారిలో..

సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకోండి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని చేరుకోవాలని వికారాబాద్ నియోజకవర్గం భాజపా (కో- ఆర్డినేటర్) సమన్వయకర్త వడ్ల నందు నాయకులు కార్యకర్తలను కోరారు. బుధవారం మండల మేకవనంపల్లిలో స్థానిక నాయకులు చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి నాయకులు భుజంగంరెడ్డి, శ్రీనివాస్, నితిష్‌రెడ్డి పాల్గొన్నారు.



మేకవనంపల్లిలో సభ్యత్వ నమోదు చేస్తున్న వడ్ల నందు

కుల్కచర్ల: ఆలోచనలు ఎలా ఉంటే.. వారు అదే విధంగా తయారు అవుతారని స్వామి వివేకానంద అనాడే చెప్పారని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శివాలయాన్ని మాజీ సర్పంచి సౌమ్యారెడ్డి తదితరులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఇసుకతో ఎమ్మెల్యే చిత్రం



ఇసుకతో తయారు చేసిన చిత్రాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బహూకరిస్తున్న తిర్మలాపూర్ గ్రామస్థులు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఉత్తమ్‌కుమార్ అరుణాచలం నుంచి తీసుకువచ్చిన ఇసుకతో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రాన్ని తయారు చేశాడు. ఎమ్మెల్యే తన సొంత గ్రామం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్‌కు వచ్చిన సందర్భంగా యువకుడు ఉత్తమ్‌కుమార్ స్థానికులతో కలసి మనోహర్‌రెడ్డికి అందజేశారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు



ముకుందాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

యాలాల, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చేస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని యాలాల ఎస్సై శంకర్ అన్నారు. బుధవారం ముకుందాపూర్, బెన్నూర్, జక్కేపల్లి గ్రామాలలో చట్టాలపై, సైబర్ నేరాలు, డయల్ 100, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీసీ కెమెరాలపై అవగాహన

పెద్దేముల్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ పంచాయతీలో సీసీ కెమెరాలపై బుధవారం ఎస్సై గిరి ప్రజలకు అవగాహన కల్పించారు. అవి ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణ జరుగుతుందని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

పూడూరు: గ్రామాల్లో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాకంచర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకాశ దీపాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని గ్రామాలకు ప్రాధాన్యం కల్పించి నిధులు సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పెంటయ్య, నాయకులు సాయన్న, యాదయ్య, పరుశురాం, రాజు, శివకుమార్ ఉన్నారు.



రాకంచర్లలో ఆకాశ దీపాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

పంటనష్టం పరిహారం చెల్లించాలి

పూడూరు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించాలని కుత్బుల్లాపూర్ సొసైటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అధిక వర్షాల మూలంగా అనేక ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, ఇతర కూరగాయ పంటలు అనేకం దెబ్బతిన్నాయని చెప్పారు. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు అప్పుల్లో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి కనీసం రూ.30 వేల చొప్పున చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు.

నవరాత్రోత్సవాలకు మండపాల ముస్తాబు

దోమ, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలకు దోమ మండల పరిధిలోని పాలేపల్లి, మోత్కూర్, దోమ, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో మండపాల ముస్తాబు చేసే పనిలో యువకులు నిమగ్నమయ్యారు. బుధవారం మండపాలు నిర్మించి రకరకాల ఆకారాల్లో అలంకరణ చేశారు. విద్యుత్తు దీపాల ఏర్పాటు, మహిళలు ఆడుకునేందుకు వీలుగా మండపం ఎదుట స్థలాన్ని శుభ్రం చేశారు.